RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | శనివారం | పేజీలు : 6
సంపుటి : 3, సంచిక : 321 | నవంబర్ 29, 2025 | వెల : రూ.3-00



చెక్ డ్యాములు,రోడ్లు, డోలి సమస్యలను పరిష్కరించాలి

4లో..

# కవిత పోరుబాట

- బీసీ రిజర్వేషన్ల కోసం జాగృతి రైలు రోకో
- రైల్వే పట్టాలపై బైఠాయించిన జాగృతి అధ్యక్షురాలు
- కార్యకర్తలు, పోలీసుల మధ్య తోపులాట, స్వల్ప వాగ్వాదం
- తోపులాటలో కవితకు స్వల్ప గాయం
- నిరసనలు కొనసాగనున్న సూచనలు





**వేద న్యూస్, కామారెడ్డి:**

బీసీ రిజర్వేషన్ల అమలు కోసం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేపట్టిన రైలు రోకో కామారెడ్డిలో ఉద్రిక్తంగా మారింది. రైల్వే పట్టాలపై బైఠాయించి నిరసన తెలిపిన కవితను అడ్డుకునేందుకు పోలీసులు ముందుకు రావడంతో పరిస్థితి ఉద్రిక్తతకు దారితీసింది. వాగ్వాదం, తోపులాట చోటుచేసు కోవడంతో కవితతో పాటు పలువురు కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన నేపథ్యంలో, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అదే రిజర్వేషన్ అమలు చేయాలని కవిత డిమాండ్ చేస్తున్నారు. ఈ డిమాండ్‌ను బలపరచేందుకు జాగృతి ఆధ్వర్యంలో రైల్వే పట్టాలపై రైలు రోకో కార్యక్రమం చేపట్టారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వం స్పందించాలన్న లక్ష్యంతో కవిత నిరసనకు దిగినట్లు ఆమె అనుచరులు తెలిపారు. కార్యకర్తల గుంపు పట్టాలపై కూర్చోవడంతో, రైల్వే రవాణా అంతరాయం కలగకుండా పోలీసులు తక్షణమే జోక్యం చేసుకున్నారు. ఈ సమయంలో కార్యకర్తలు, పోలీసుల మధ్య స్వల్ప తోపులాట జరిగింది. తోపులాటలో కవిత చేతికి స్వల్ప గాయాలయ్యాయని జాగృతి నేతలు తెలిపారు. అయితే పెద్దగా ప్రమాదం జరగలేదని, గాయాలు సాధారణమేనని సమాచారం.

**– బీసీ రిజర్వేషన్ల సాధనకు పోరాటం**

ఉద్రిక్తత పెరిగే అవకాశం ఉండడంతో పోలీసులు అక్కడున్న వారిని స్టేషన్ బయటకు తరలించారు. అదుపులోకి తీసుకున్న కవిత, కార్యకర్తలను తరువాత పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం వెంటనే స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలి, ప్రజల ఇచ్చిన హామీలను అమలు చేయాలని కవిత తన నిరసనలో పేర్కొన్నారు. రిజర్వేషన్ సాధించే వరకు జాగృతి పోరాటం కొనసాగుతుందని ఆమె అనుచరులు స్పష్టం చేస్తున్నారు.

**– బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందే : కవిత**

తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి పట్టణంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జాగృతి శ్రేణులతో కలిసి రైల్ రోకో నిర్వహించారు కవిత మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఇస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 17 శాతం రిజర్వేషన్లతోనే పంచాయతీ ఎన్నికలను నిర్వహించడం దారుణం అని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు అమలు కాకుండా కాంగ్రెస్, బీజేపీలు కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు.



## 2026 నాటికి హైదరాబాద్‌లోని అన్ని స్టేషన్లు ఆధునికీకరణ

**– హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి : కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

**వేద న్యూస్, హైదరాబాద్ :**

హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌ను అత్యాధునిక సదుపాయాలతో, హైటెక్ సిటీ స్థాయికి పోటీ పడేలా అభివృద్ధి చేస్తున్నట్టు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. శుక్రవారం ఆయన హైటెక్ సిటీ స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి అధికారుల నివేదికలను స్వీకరించారు. వేగంగా సాగుతున్న పనులు నగర రైలు కనెక్టివిటీ వ్యవస్థలో గణనీయ మార్పులు తీసుకురానున్నాయని ఆయన అన్నారు. ఇక్కడి స్టేషన్ అభివృద్ధి రెండు విడతల్లో రూ.35 కోట్ల వ్యయంతో కొనసాగుతున్నట్లు మంత్రి తెలిపారు. 2026 ఫిబ్రవరిలో తొలి విడత పూర్తవుతుందని, తదనంతరం రెండో విడతను కూడా వేగంగా పూర్తి చేసి స్టేషన్‌ను ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా మార్చనున్నామని చెప్పారు. ప్రయాణికులకు విస్తృత ప్లాట్‌ఫారంలు, ఆధునిక వెయిటింగ్ ఏరియాలు, మెరుగైన యాక్సెస్ మార్గాలు, సమగ్ర రవాణా అనుసంధానం లభించనున్నాయని అధికారులు వివరించారు. ఇదిలా ఉంటే, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు వచ్చే ఏడాదిలో పూర్తవుతాయని కిషన్ రెడ్డి తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా నగర ప్రయాణికుల సౌకర్యార్థం 16 ప్రత్యేక రైళ్లను నిలిపివుంచే ఏర్పాట్లు చేసినట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. స్టేషన్ల ఆధునికీకరణ పనులు పూర్తి కావడంతో రాబోయే సంవత్సరాల్లో హైదరాబాద్ నగర రైల్వే నెట్‌వర్క్ పూర్తిగా కొత్త రూపు సంతరించుకోనుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఘనంగా జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి

**– జ్యోతిబాపులే విగ్రహానికి మంత్రి పొన్నం ప్రభాకర్ నివాళులు**

**వేద న్యూస్, హైదరాబాద్ :**



మహనీయ సామాజిక సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి సందర్భంగా అంబర్‌పేట్ అలీ కేఫ్ చౌరస్తా వద్ద ఘన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్ జ్యోతిబాపులే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పూలే చూపించిన మార్గం భారత సమాజాన్ని శోషణల నుండి బయటపెట్టే శక్తిగా నిలిచిందని, ఆయన సేవలు చిరస్థాయిగా గుర్తుండేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సామాజిక న్యాయం, విద్యా సమానత్వం కోసం పూలే చేసిన పోరాటాన్ని విద్యార్థులకు వివరించారు. పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు పుస్తకాలు అందజేసి, పూలే భావజాలాన్ని కొనసాగించేలా చదువు-చైతన్య పథంలో నడవాలని ఆయన సూచించారు. విద్య మాత్రమే పేదల జీవితాలను మార్చగల శక్తి అని మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి, కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు, రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు మోత రోహిత్ తదితరులు పాల్గొన్నారు. పూలే సేవలను తరతరాలకు చేరవేయాల్సిన అవసరాన్ని నాయకులు నొక్కిచెప్పారు. మహిళా విద్య, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన చూపిన మార్గం నేటికీ సమకాలీనమని వారు గుర్తు చేసుకున్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే సమానత్వం కోసం చేసిన పోరాటం భారత సామాజిక ప్రగతికి బాటలు వేసిందని, ఆయన స్ఫూర్తిని కొనసాగించే కార్యక్రమాలు ప్రభుత్వం చేపడుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. పూలే ఆశయాలు ప్రజల్లో చైతన్యాన్ని రగిలిస్తూనే ఉంటాయని నాయకులంతా ఏకమై అభిప్రాయపడ్డారు.

## ఆదివాసీ ఆచారాలు, ఆధ్యాత్మికతతో ఆలయ నిర్మాణం

**– భక్తుల సంఖ్య అంచనాతో మేడారం జాతర అభివృద్ధి**
**– మేడారం సమ్మక్క జాతర పనులను మంత్రులు పొంగులేటి, సీతక్కతో పరిశీలించిన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**

**వేద న్యూస్, హైదరాబాద్ :**



ఆసియా ఖండంలోనే అతి ఆదివాసీ, గిరిజన జాతర మేడారం భక్తుల సంఖ్య అంచనా ఆధారంగా అభివృద్ధి పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. ప్రస్తుతం చేపడుతున్న ప్రతి నిర్మాణంలో ఆదివాసీ, గిరిజన, కోయ ఆచారాలు, ఆధ్యాత్మిక చింతన ప్రస్ఫుటించాలని స్పష్టం చేశారు. శుక్రవారం వరంగల్ ఇన్‌ఛార్జి మంత్రి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పంచాయితీరాజ్ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ఎంపీ బలరాం నాయక్ తదితర అధికారులతో కలిసి ఆలయ సంబంధిత నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకొని మేడారంలో శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సూచన మేరకు ఆలయ నిర్మాణ పనులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఆదివాసీ ఇలవేల్పులు సమ్మక్క


మిగతా 3వ పేజీలో..

## ముంపు గ్రామాలపై ఏరియల్ సర్వే

**వేద న్యూస్, నారాయణపేట :**

నారాయణపేట జిల్లా మకతల్ నియోజకవర్గంలోని ముంపు ప్రభావిత గ్రామాల పరిస్థితిని ప్రత్యక్షంగా అవగాహన చేసుకోవడానికి నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్‌తో కలిసి ఏరియల్ సర్వే నిర్వహించారు. సంగంబండ, జూరాల ప్రాజెక్టుల వల్ల అనేక గ్రామాలు భాగశః మునిగిపోతుండటంతో, ఆ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించారు. ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్ల పెరుగుదలతో ఇళ్లతో పాటు వ్యవసాయ భూములు కూడా నష్టపోతున్నట్టు అధికారులు వివరించారు. ఏరియల్ సర్వే అనంతరం ముంపు ప్రభావిత గ్రామాల ప్రజలతో నిర్వహించిన ఇంటరాక్టివ్

మిగతా 3వ పేజీలో..




## పార్లమెంట్ భవనానికి మరింత బలోపేతమైన భద్రత

**వేద న్యూస్ డెస్క్ :**

పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్ భద్రతను మరింత పటిష్టం చేస్తూ సీఐఎస్ఎఫ్ ఆధునికీకరణ చర్యలను చేపట్టింది. సమగ్ర సమీక్ష అనంతరం యాక్సెస్ కంట్రోల్, పరిమితి భద్రత (పెరిమీటర్ సెక్యూరిటీ), అంతర్గత భద్రత, కౌంటర్ టెర్రర్ రెడీనెస్, ఎమర్జెన్సీ రెస్పాన్స్ వంటి అంశాలన్నింటినీ అప్‌గ్రేడ్ చేసినట్లు ఈ దళం ప్రకటించింది. భారత ప్రజాస్వామ్య హృదయమైన

మిగతా 3వ పేజీలో..




వేద న్యూస్

శనివారం, నవంబర్ 29, 2025

# ముదిరాజ్ లు ఆర్థికంగా ఎదగాలి

**– మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్**



**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

ముదిరాజులు ఆర్థికంగా ఎదగాలని మెపా (ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ అన్నారు. వరంగల్ జిల్లాలోని నర్సంపేట పట్టణం సమీపంలోని మాదన్నపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన ముదిరాజ్ సంఘం భవనం కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవంలో మాదన్నపేట కుల పెద్దమనిషి గిరబోయిన రాజేందర్ ముదిరాజ్, సొసైటీ అధ్యక్షులు, డైరెక్టర్స్ ల ఆహ్వానం మేరకు పులి దేవేందర్ ముదిరాజ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్థానిక ముదిరాజ్ పెద్దలు,మహిళలు, పులి దేవేందర్ ముదిరాజ్ గారిని శాలువాతో సత్కరించారు. అనంతరం మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని ముదిరాజులు ఆర్థికంగా బలోపేతం కావాలని,అలాగే ముదిరాజ్ ఫంక్షన్ హాల్ నించుకోవాలని పిలుపునిచ్చారు. ముదిరాజ్ మహిళలు సైతం అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ముదిరాజ్ యువత చదువులో రాణించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని అందుకు తల్లిదండ్రులు ప్రోత్సాహం అందించాలని ఈ సందర్భంగా పులి దేవేందర్ సూచించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు. మాదన్నపేటలో ముదిరాజ్ పెద్దలు అందరూ కలిసి కమ్యూనిటీ భవనం నిర్మించుకోవడం అభినందనీయమని అన్నారు. ముదిరాజులు సంఘటితంగా తమ హక్కుల కోసం పోరాడాలని అందుకు మెపా ఎల్లప్పుడూ జాతి బిడ్డల వెంట నడుస్తుందని అన్నారు. విద్య, ఉద్యోగం, సాధికారిక లక్ష్యంగా ముందుకెళ్తున్న మెపా కు గ్రామీణ ప్రాంతాల్లోని ముదిరాజులు అండగా నిలవాలని కోరారు. సమిష్టిగా పోరాడితేనే ముదిరాజుల హక్కులను సాధించుకోగలమని ఈ సందర్భంగా దేవేందర్ అన్నారు. సంఘాలు ఎన్ని ఉన్నా సమిష్టి పోరాటాలతోనే ప్రభుత్వ ఫలాలు అందుకోగలమని దేవేందర్ తెలిపారు. కార్యక్రమంలో మెపా నర్సంపేట డివిజన్ గౌరవ అధ్యక్షులు పిట్టల కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ, గౌరబోయిన రాజేందర్, దండు రవి,మారపాక నర్సయ్య, బిక్షపతి, జినుకల నర్సయ్య, దండు రామ నర్సు, రమేష్, మారపాక రమేష్, తెప్ప చిరంజీవి, దొంతరబ్లిన రమేష్, పోలబోయిన్ నూతన్ కుమార్, మారపాక కోమల, గిరబోయిన సంధ్య, కవిత ముదిరాజ్,లతో మాదన్నపేట, ముత్తోజీ పేట, ఇటుకాలపల్లి, నాగుర్ల పల్లె లోని ముదిరాజ్ లతో పాటి 300 మంది మహిళలు పాల్గొన్నారు.

# గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుంది

**– బిజెపి బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి**
**– జన్నే మొగిలి మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు**



**వేద న్యూస్,శాయంపేట:**

శాయంపేట మండల కేంద్రంలో స్థానిక సర్పంచ్ వార్డు మెంబర్లు ఎన్నికల సన్నాక సమావేశం బిజెపి మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నే మొగిలి ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడుతూ మూడవ విడతగా శాయంపేట మండలంలో జరగనున్న స్థానిక సర్పంచ్ ,వార్డు మెంబర్ ఎన్నికలలో బిజెపి బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని వారు తెలిపారు. గ్రామపంచాయతీకి వచ్చే నిధులలో ఎక్కువ మొత్తం బిజెపి కేంద్ర ప్రభుత్వం ద్వారానే వస్తున్నాయి గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కంకణం కట్టుకొని గ్రామాల అభివృద్ధి చెందుతూనే దేశం అభివృద్ధి చెందుతుంది అనే నినాదంతో ముందుకు వెళుతుంది కనుక బిజెపి అభ్యర్థులను గెలిపించడం ద్వారా గ్రామాల అభివృద్ధి ఇంకా వేగంగా జరుగుతుందని వారు అన్నారు.అదేవిధంగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామపంచాయల్ని నిర్వీర్యం చేసి ఇన్ని రోజులుగా గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించక పోవడం వల్ల గ్రామపంచాయతీకి కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులు రాక గ్రామాల అభివృద్ధి కుంటుపడిందని దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా ఈరోజు స్థానిక సంస్థ ఎన్నికలలో పోటీ చేయాలని చూస్తుంది అని వారు ఎద్దేవా చేశారు.కనుక ప్రజలు ఇది గమనించి కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాయరాకుల మొగిలి, జిల్లా ఉపాధ్యక్షురాలు కోడెపాక స్వరూప,జిల్లా కౌన్సిల్ మెంబర్ కానుగుల నాగరాజు, మండల ప్రధాన కార్యదర్శులు భూతం తిరుపతి, మామిడి విజయ్, సీనియర్ నాయకులు బాసని విద్యాసాగర్, వనం దేవరాజ్, గడ్డం రమేష్, మోత్కూరి సత్యనారాయణ, యువ మోర్చా జిల్లా నాయకులు కొత్తపల్లి శ్రీకాంత్,లడే శివ, దళిత మోర్చ మండల అధ్యక్షుడు మంద సురేష్, మండల ఉపాధ్యక్షులు కోమటి రాజశేఖర్, మండల కార్యదర్శులు మేకల సుమన్, వంగరి శివ, కోశాధికారి కుక్కల మహేష్,ఎర్ర రాకేష్ రెడ్డి, భూత్ అధ్యక్షులు వంగాల భాస్కర్ రెడ్డి, పున్నం సాంబయ్య, పెద్దిరెడ్డి సీతారాం రెడ్డి, ఎర్ర తిరుపతిరెడ్డి, మూడెడ్ల పైడి, మంద మధు, చెక్క దినేష్, కొంగరి సుధాకర్, మైల ప్రమోద్, కన్నెబోయిన రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# పూలే విగ్రహానికి ఘనంగా నివాళి



**వేద న్యూస్, వరంగల్:**

తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో 135 వ మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి పురస్కరించుకొని పూలే విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమలో తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ మధుపాక ఎల్లయ్య, తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి ఇల్లందుల రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్లయ్య మాట్లాడుతూ 1827 ఏప్రిల్ 11 నుండి 28 నవంబర్ 1890 వరకు మహాత్మ జ్యోతిరావు పూలే ప్రస్తావం జరిగినది మహాత్మా అనే బిరుదు ప్రజలచే పొందారు. సమాజంలో సగభాగం ఉన్నటువంటి స్త్రీలకు విద్యను అందించిన మహనీయుడు మానవ హక్కుల ప్రదాత బ్రాహ్మణిజంలో ఉన్న తంతును తెలియజేయుటకు తృతీయ రత్న అనే నాటకాన్ని రచించి ప్రజల చైతన్యపరిచారు. 48 పేద పిల్లలకై స్కూలు నిర్మించారు. సత్యశోధక సమాజాన్ని ఏర్పాటు చేసి సమాజంలో ఉండబడేటటువంటి సామాజిక రుగ్మతలకు పరిష్కారాన్ని చూపించారు. ఈ కార్యక్రమంలో బొమ్మల అంబేద్కర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ లోకి చేరికలు



**వేద న్యూస్, ఆసిఫాబాద్ ప్రతినిధి:**

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని పలు గ్రామాల ప్రజలు కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. వీరికి డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, పార్టీ నియోజక వర్గ ఇంచార్జి అజ్మీరా శ్యాం నాయక్ లు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వాటికి ఆకర్షితులై పార్టీలోకి చేరుతున్నట్లు చెప్పారు. ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక సంఖ్యలో పార్టీ సర్పంచులను గెలిపించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శంకర్, ఖుషాబ్ రావు, సుదర్శన్, సాజిద్ ఖాన్, సాగర్, రజాక్, మారుతి తదితరులు ఉన్నారు.

# నామినేషన్ ల కేంద్రాలను ఆకస్మిక తనిఖీ

**వేద న్యూస్, రుద్రూర్ :**



రుద్రూర్ మండల కేంద్రం లోని రుద్రూర్, అక్బర్ నగర్, సులేమాన్ నగర్, రాయకూర్ గ్రామాలల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ ల కేంద్రాలను శుక్రవారం బోధన్ ఏసిపి శ్రీనివాస్ తనిఖీ నిర్వహించారు. ఆయన వెంట సీఐ కృష్ణ, ఎస్సై పి.సాయన్న, పంచాయతీ సెక్రెటరీలు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

# ఎన్నికల నిర్వహణపై పలు సూచనలు



**వేద న్యూస్, కాసిపేట:**

మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపిడిఓ సత్యనారాయణ సింగ్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రెండవ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికలు 2025 భాగంగా ఎన్నికల నమూనా ప్రవర్తనా నియమావళి" రాజకీయ పార్టీలు, నాయకులు అభ్యర్థులు ఎన్నికల సమయంలో పాటించాల్సిన మార్గదర్శకాలు నామినేషన్ స్వీకరణ పోలింగ్ కేంద్రల వద్ద తగు ఏర్పాట్ల గురించి పంచాయతీ కార్యదర్శులకు తగు సూచనలు చేశారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంపీఓ శేక్ సఫ్దర్ అలీ, సీనియర్ సహాయకులు ఏ.లక్ష్మీ నారాయణ, పంచాయతీ కార్యదర్శులు, సిఓ రాజేందర్ పాల్గొన్నారు.

# ఎన్నికల నేపథ్యంలో రౌడీషీటర్ బైండోవర్



**వేద న్యూస్, కాసిపేట:**

దేవాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్ పొట్ట శ్రీనివాస్‌ను గ్రామపంచాయతీ ఎన్నికల దృష్ట్యా ముందస్తు చర్యగా అధికారులు బైండోవర్ చేశారు. ఎన్నికల సమయంలో ఎటువంటి అప్రత్యక్ష ఘటనలు, శాంతిభద్రతల లోపాలు సంభవించకుండా ఉండేందుకు, దేవాపూర్ పోలీసులు శ్రీనివాస్ ను ఎమ్మార్వో వద్ద హాజరు పరచి, చట్టపరమైన చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా ఎమ్మార్వో మాట్లాడుతూ, "ఎన్నికల సందర్భంగా ఎవరైనా చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రజలు భయపడకుండా, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నాము అని తెలిపారు.పోలీస్ అధికారులు ఎన్నికల కాలంలో నేరప్రవర్తన ఉన్న వ్యక్తులపై నిఘా ఉంచి, శాంతిభద్రతల పరిరక్షణ కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

# వైభవంగా మైసమ్మ అమ్మవారి వార్షికోత్సవ వేడుకలు



**వేద న్యూస్,కాసిపేట:**

కాసిపేట 1 ఇంక్లైన్ గని ఆవరణలో శుక్రవారం శ్రీ మైసమ్మ అమ్మవారి 24 వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది భక్తి శ్రద్ధలతో ఉత్సవాలను వైభవంగా జరుపుకుంటారు. భక్తుల సంక్షేమం, గని అభివృద్ధి, శాంతి సమృద్ధి కోసం పురోహితుల వేదఘోషల మధ్య శాంతి చండీ యాగం నిర్వహించారు. యాగంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. వేడుకల అనంతరం మహా ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో గని కార్మికులు, స్థానికులు, భక్తులు అన్నదానం స్వీకరించారు. ముఖ్య అతిథులుగా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ శ్రీవాణి దంపతులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.ఏజెంట్ రాంబాబు,మేనేజర్ సతీష్ స్వప్న దంపతులు, గతం లో పని చేసిన మేనేజర్ అల్లాఉద్దీన్,సునీల్ కుమార్-కాంచన్ లత సింగ్, నిఖిల్, వెంకటేష్, సుమన్,రియాజ్ మహమ్మద్, హెచ్ ఎం ఎస్ రాజీరెడ్డి సిఐటియు, దాగం మల్లేష్, ఏఐటియుసి ,మెడిపెల్లి సంపత్ టీబీజీకేఎస్,బన్న లక్ష్మన్ దాస్ ఐ ఎన్ టి యు సి ,మీనుగు లక్మి నారాయణ,బైరి శంకర్, శ్రీధర్,థామస్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా టీం



**వేద న్యూస్, నల్లబెల్లి :**

నల్లబెల్లి మండలంలోని నాగరాజుపల్లి గ్రామపరిధిలోని పంతులుపల్లి ప్రాథమిక పాఠశాలను శుక్రవారం జిల్లా స్థాయి ప్రత్యేక బృందం తనిఖీ నిర్వహించింది. ఈ సందర్భంగా నోడల్ అధికారి వోదెల పార్థసారథి, టీం సభ్యులు తాటిపెల్లి చైతన్య, పాఠశాల హెడ్మాస్టర్ కర్ణకంటి రాంమూర్తి సమక్షంలో పాఠశాల పనితీరుపై ప్యానల్ ఇన్స్పెక్షన్ నిర్వహించారు. ఉదయం ప్రార్థనా సమయం నుంచి, సాయంత్రం పాఠశాల ముగింపు సమయం వరకు పాఠశాల పనితీరు, ఉపాధ్యాయుల బోధనా పద్ధతులను, విద్యార్థుల ప్రగతిని, పాఠశాలలోని మౌళిక సదుపాయాలు, పాఠశాల పరిశుభ్రత, విద్యార్థుల మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయుల లెసన్ ప్లాన్స్, పీరియడ్ ప్లాన్స్, బోధనాభ్యసన సామాగ్రి, వివిధ రకాల రిపోర్ట్లు, ఫార్మాటివ్, సమ్మేటివ్ పరీక్షల జవాబు పత్రాలను, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, వర్క్ బుక్స్, సంబంధించిన అలైన్ మెంట్ రికార్డు, విద్యార్థులు చదువుతోపాటు ఆటలు, పాటలు ,స్కిట్స్ ,వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. పాఠశాల పనితీరులో మున్ముందు మరింత పనితీరు చూపే అంశాలను గురించి కొన్ని సూచనలు సలహాలు కూడా అందజేశారు.

# రుద్రూర్ మండలంలో 11 నామినేషన్ లు దాఖలు

**వేద న్యూస్, రుద్రూర్ :**

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ ల స్వీకరణలో భాగంగా ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలలో రెండవ రోజు రుద్రూర్ మండలంలోని 11 గ్రామ పంచాయతీలకు గాను సర్పంచ్ పదవులకు 11 నామినేషన్లు దాఖలు అయ్యాయని ఎంపీడీవో బాలగంగాధర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. అంబం -2, బొప్పాపూర్- 2, చిక్కడపల్లి -1, రాయకూర్ -1, రాయకూర్ క్యాంపు-1, సిద్దాపూర్ - 2, సులేమాన్ నగర్ - 2 నామినేషన్ లు దాఖలు అయ్యాయని వివరించారు.

**వార్డు మెంబర్లకు 31 నామినేషన్ల దాఖాలు**

అక్బర్ నగర్ -1, అంబం -3, బొప్పాపూర్-3, చిక్కడపల్లి-4, రాయకూర్-1, రాయకూర్ క్యాంపు -7, రాణంపల్లి-2, రుద్రూర్ -3, సిద్దాపూర్ -2, సులేమాన్ నగర్ -5 మొత్తం 31 నామినేషన్లు దాఖలు అయినట్లు పేర్కొన్నారు.

# ఆదివాసీ ఆచారాలు, ఆధ్యాత్మికతతో ఆలయ నిర్మాణం



సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలున్న ప్రాంగణాన్ని లక్షలాది భక్తులు దర్శించుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తామన్నారు. రోడ్డు నిర్మాణ పనులు, డివైడర్లు, ప్లాంటేషన్ తదితర పనులు పూర్తి కావడానికి 24 గంటలు నిరంతరం పని చేయాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు. గద్దెల దర్శనం, బంగారం (బెల్లం) సమర్పణ జంపన్న వాగులో స్నానాలు ఆచరించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రధానంగా గుడి ప్రాంగణంలో చేస్తున్న అభివృద్ధి పనులను, జంపన్న వాగు, స్తూపం నుండి బస్టాండ్ వరకు జరిగే రోడ్ల విస్తరణను ఇతర మంత్రులు, ప్రజాప్రతినిధులతో పరిశీలించారు. ఈ పరిశీలనా కార్యక్రమంలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, ఆర్ అండ్ బి ఈ ఎన్సీ మోహన్ నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానొత్ రవి చందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, రాష్ట్ర నాయకులు మనోజ్ కుమార్, మండల మాజీ అధ్యక్షులు జాలపు అనంత రెడ్డి, జిల్లా నాయకులు, మండల నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ముంపు గ్రామాలపై ఏరియల్ సర్వే



సమావేశంలో మంత్రి వక్కితి శ్రీహరి ముదిరాజ్ మాట్లాడారు. మకతల్ నియోజకవర్గంలోని పలు గ్రామాలు సంవత్సరాలుగా ముంపు సమస్యలను ఎదుర్కొంటున్నాయని ఆయన పేర్కొన్నారు. సంగంబండ, జూరాల ప్రాజెక్టుల విస్తరణతో ముంపు స్థాయి మరింత పెరిగి, ప్రజల జీవన విధానమే మారిపోయిందన్నారు. ప్రజలకు శాశ్వత పరిష్కారం కల్పించాల్సిన అవసరం ఉందని, తగిన పునరావాస, పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సూచించనున్నట్టు శ్రీహరి వెల్లడించారు. గ్రామస్తులు ఈ సమావేశంలో తమ సమస్యలను వివరంగా వెల్లడించారు. ఇళ్ల నష్టం, భూక్షేత్రాల కోల్పోవడం, పశువుల పెంపకం సంక్షోభం, రహదారులు - రవాణా అంతరాయం, విద్య- ఆరోగ్య సౌకర్యాల లోపం వంటి అనేక సమస్యలను వారు వెల్లడించారు. ప్రాజెక్టుల వల్ల వచ్చిన ముంపు తమ జీవనోపాధిని తీవ్రంగా దెబ్బతీసిందని, ప్రభుత్వం న్యాయమైన ఆర్, ఆర్ ప్యాకేజీలను అందించాలని వారు కోరారు. గ్రామస్థులు పేర్కొన్న ప్రతి అంశాన్ని అధికారులు నమోదు చేశారు. ముంపు బాధితుల ఆవేదనను విన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందిస్తూ, గ్రామస్తుల పునరావాసం అత్యంత ప్రాముఖ్యంగా పరిగణించబడుతుందని తెలిపారు. ఆర్,ఆర్ ప్యాకేజీలను పునర్వ్యమర్శించి, తగిన పరిహారం అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని నమ్మబలికారు. ఈ ప్రాంత ప్రజలకు శాశ్వత ఉపశమనం కల్పించడానికి అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయమని అధికారులను ఆదేశించారు. ముంపు సమస్యను సమగ్రంగా పరిశీలించి, త్వరలోనే నివేదిక సమర్పిస్తామని మంత్రి తెలిపారు.

# పార్లమెంట్ భవనానికి మరింత బలోపేతమైన భద్రత

పార్లమెంట్‌కు ఏపాటివైనా ముప్పులు ఎదుర్కొనే సామర్థ్యంతో భద్రతను సీఐఎస్ఎఫ్ బలోపేతం చేస్తోంది. ఈ అప్‌గ్రేడెడ్ వ్యవస్థలో భాగంగా 3,300 మంది సీఐఎస్ఎఫ్ సిబ్బంది పార్లమెంట్ భవన సముదాయంలో నియోజకులయ్యారు. అత్యాధునిక స్క్రీనింగ్ సిస్టమ్‌లు, యాక్సెస్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీలు, అనుమానాస్పద కదలికలను గుర్తించే ప్రత్యేక సెన్సార్ వ్యవస్థలు ఉపయోగిస్తున్నారు. స్థానికస్థాయి భద్రతా సిబ్బందికి డ్రోన్ ఆపరేషన్స్, సైబర్ సెక్యూరిటీ, రెస్పాన్స్, అలాగే మరియు ఆర్మీ మాడ్యూల్‌ల పై ప్రత్యేక శిక్షణ ఇవ్వబడింది. ఈ శిక్షణలు ఏవైనా అత్యవసర పరిస్థితులను వేగంగా, ఖచ్చితంగా ఎదుర్కొనేలా సీఐఎస్ఎఫ్‌ను సిద్ధం చేస్తున్నాయి. భద్రతా సిబ్బందిపై విధుల కేటాయింపులోనూ మార్పులు చేస్తూ మరింత క్రమశిక్షణతో కూడిన వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. అంతేకాదు, వివిధ భద్రతా సంస్థలతో క్రమం తప్పని మల్టీ%-%ఏజెన్సీ డ్రిల్లులు నిర్వహించడం ద్వారా సమన్వయం, స్పందన సామర్థ్యాలను పెంచుతున్నారు. భారత ప్రజాస్వామ్యం నడిచే పార్లమెంట్‌కు రక్షణ వలయంగా నిలిచే సీఐఎస్ఎఫ్, ఎల్లప్పుడూ సురక్షితమైన, స్థిరమైన వాతావరణాన్ని కల్పించేందుకు నిబద్ధంగా పనిచేస్తుందనే విషయం మరోసారి స్పష్టం చేసింది.



# గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుంది

**వేద న్యూస్, టేక్మాల్:**

మెదక్ జిల్లా టేక్మాల్ మండల కేంద్రంలో ఎలుపేట్ గ్రామ పంచాయతీ నుండి మొట్ట మొదటి సారి బీజేపీ పార్టీ తరుపున మామిడి గారి చంద్రకళ రెడ్డి సర్పంచ్ కు నామినేషన్ వేయడం జరిగింది. అభ్యర్థి నీ బలపరిచిన యువకుడు పోతారాజు సురేందర్, గ్రామ బీజేపీ అధ్యక్షులు, లక్ష్మినారాయణ, స్థానిక సర్పంచ్ వార్డు మెంబర్ల ఎన్నికల సన్నాక సమావేశం బిజెపి మండల అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక సర్పంచ్ ,వార్డు మెంబర్ ఎన్నికలలో బిజెపి బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని వారు తెలిపారు. గ్రామపంచాయతీకి వచ్చే నిధులలో ఎక్కువ మొత్తం బిజెపి కేంద్ర ప్రభుత్వం ద్వారానే వస్తున్నాయి గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కంకణం కట్టుకొని గ్రామాల అభివృద్ధి చెందుతూనే దేశం అభివృద్ధి చెందుతుంది అనే నినాదంతో ముందుకు వెళుతుంది కనుక బిజెపి అభ్యర్థుల ను గెలిపించడం ద్వారా గ్రామాల అభివృద్ధి ఇంకా వేగంగా జరుగుతుందని వారు అన్నారు.అదేవిధంగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పంచాయతి లు నిర్వీర్యం చేసి ఇన్ని రోజులుగా గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల గ్రామపంచాయతీకి కేంద్ర



ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులు రాక గ్రామాల అభివృద్ధి కుంటు పడిందని దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా ఈరోజు స్థానిక సంస్థ ఎన్నికలలో పోటీ చేయాలని చూస్తుంది అని వారు ఎద్దేవా చేశారు.కనుక ప్రజలు ఇది గమనించి కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్తారని ఆయన అన్నారు, కార్యకర్తలు లోహిత్ రెడ్డి, ఎర్ర కృష్ణ, కొమరయ్య,తదితరులు పాల్గొన్నారు.

# పరిశోధనల్లో కేయూ విద్యార్థులు ముందంజలో ఉండాలి



**వేద న్యూస్, కేయూ క్యాంపస్ :**

కాకతీయ యూనివర్సిటీ స్వర్ణోత్సవాల సందర్భంగా వచ్చే నెల డిసెంబర్ 9, 10 తేదీలలో డీన్, స్టూడెంట్స్ ఎఫైర్స్ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించబోతున్న నోబెల్ ప్రైజ్ డే సెలబ్రేషన్స్ బ్రోచర్ ను విసి కార్యాలయంలో కేయూ విసి ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం, యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి .మనోహర్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కృష్ణవేణి, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి, ఈ కార్యక్రమ విద్యార్థి కన్వీనర్లు వికాస్, శ్రేయ, హరితలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేయూ విసి ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, పరిశోధన ఆవిష్కరణలు విద్యార్థులలో పరిశోధన, సైన్సు సబ్జెక్టుల పట్ల అభిరుచి కలవడానికి నోబుల్ ప్రైజ్ డే ఉత్సవాలు ఉపయోగపడతాయని కేయూ విసి ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి అన్నారు. పరిశోధనల్లో విద్యార్థులు రాణించాలని, సబ్జెక్ట్ పట్ల విద్యార్థులు అభిరుచి పెంచుకోవాలని, పరిశోధనలు చేసి నోబెల్ బహుమతి పొందిన వారిని విద్యార్థులందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమ నిర్వాహకులను అభినందించారు. డీన్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి, యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కృష్ణవేణి ఈ కార్యక్రమ నిర్వహణ వివరాలను తెలియచేశారు. ఈ కార్యక్రమం విద్యార్థులలో అంతర్జాతీయ శాస్త్రీయ అవగాహనను పెంపొందించేందుకు, నోబెల్ విజేతల ఆవిష్కరణల ను గుర్తు చేసేందుకు, సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు ఉద్దేశించబడిందని తెలిపారు. విద్యార్థులకు పోస్టర్ ప్రజంటేషన్లు డిసెంబర్ 9, 2025న రసాయన శాస్త్రం, ఫిజిక్స్, ఇంగ్లీష్, ఆర్థిక శాస్త్ర విభాగాలతో పాటు లైఫ్ సైన్సెస్ విభాగాలైన బాటనీ, జూవాలజీ, మైక్రోబయాలజీ, బయో కెమిస్ట్రీ, బయో టెక్నాలజీ, ఫార్మసీ విభాగాలలో విద్యార్థులకు నిర్దేశించిన అంశంపై పోస్టర్ ప్రజెంటేషన్, వక్తృత్వ పోటీలు ఉంటాయన్నారు. రసాయన శాస్త్రం విద్యార్థులకు శాస్త్రం, సమాజాన్ని మార్చిన నోబెల్ రసాయన ఆవిష్కరణలు అనే అంశంపై, భౌతిక శాస్త్రం విద్యార్థులకు నోబెల్ భౌతిక ఆవిష్కరణలు ఆధునిక ప్రపంచాన్ని ఎలా ఆకృతీకరించాయి అనే అంశంపై, లైఫ్ సైన్సెస్, ఫార్మసీ విద్యార్థులకు నోబెల్ ఆవిష్కరణలు మానవ ఆరోగ్యానికి ఎలా ఉపయోగపడతాయనే అంశంపై, ఆర్థిక శాస్త్రం విద్యార్థులకు నోబెల్ ఆర్థిక శాస్త్ర విజేతలు సమాజాలను ఎలా మార్చారు అనే అంశంపై, ఇంగ్లీష్ విభాగం విద్యార్థులకు సాహిత్యంలో నోబెల్ విజేతలు ప్రపంచాన్ని మార్చిన స్వరాలు అనే అంశాలపై పోటీలు ఆయా విభాగాల్లోనే నిర్వహించబడతాయని వివరించారు. పోటీల్లో పాల్గొనాలనుకునే విద్యార్థులు తమ పేర్లను డిసెంబర్ 05.2025 లోపు తమ విభాగానికి లేదా ఆన్లైన్ లో సమర్పించాలని తెలిపారు. విభాగాల వారీగా సెమినార్ నిర్వహణ డిసెంబర్ 10.2025న నిర్దేశించిన విభాగాల్లో నోబుల్ బహుమతి లభించిన పరిశోధన అంశంపై విషయ నిపుణులతో సెమినార్లు ఉంటాయని, ఆతర్వాత కేయూ సెనేట్ హాల్లో జరిగే ముగింపు కార్యక్రమంలో వీసీ,రిజిస్ట్రార్లు ముఖ్య అతిథులుగా హాజరై పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహణ కొరకు వివిధ విభాగాల నుండి విద్యార్థులతో నిర్వహణ కమిటీ వేశామని ఈ కార్యక్రమ నిర్వహణలో విద్యార్థి కమిటీ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ వెల్ఫేర్ ఆఫీసర్లు డా. రాధికా, డా. నిరంజన్ పాల్గొన్నారు.

# డిసెంబర్ 3న మహా ధర్నాను జయప్రదం చేయండి

**- జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడనాడాలి**

**వేద న్యూస్, ఆసిఫాబాద్ ప్రతినిధి:**

జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడనాడాలని టీయూడబ్ల్యూజే ( ఐజేయూ ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రహమాన్, ఎస్ సంపత్ కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో జర్నలిస్టుల మహా ధర్నాకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వరాష్ట్రంలో బతుకులు మెరుగు పడతాయని తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి , పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో కూడా జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం కాకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఉద్యమ కాలంలోనూ, ఆ తర్వాత పదేళ్ల పాలనలోనూ బీఆర్ఎస్ ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితమైపోయాయని,ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అదే బాటలో ప్రయాణించడం దారుణమన్నారు. నూతన పాలసీని రూపొందించి అక్రెడిటేషన్లు జారీ చేయడం, ఆరోగ్య భద్రత కల్పించడం, ఇళ్ల స్థలాలు మంజూరు చేయడం, అనేక వృత్తి కమిటీలను పునరుద్ధరించడం వంటి కనీస సౌకర్యాలు కల్పనలో ప్రభుత్వం తీవ్రమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నదన్నారు. అక్రెడిటేషన్ పాలసీని వెంటనే ప్రకటించి కొత్త కార్డులు జారీ చేయాలని, ఆరోగ్య బీమా పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని, వృత్తి కమిటీలు వెంటనే ఏర్పాటు చేయాలని, సంక్షోభంలో ఉన్న



చిన్న, మధ్యతరగతి పత్రికలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం డిసెంబర్ 3 తేదీన హైదరాబాద్ లోని సమాచార కమిషనర్ కార్యాలయం ఎదుట మహా ధర్నా కార్యక్రమానికి జిల్లాలోని జర్నలిస్టులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అక్రిడేషన్ కమిటీ మెంబర్ ప్రకాష్ గౌడ్ , టియూడబ్ల్యూజే జిల్లా కోశాధికారి సతీష్, ఆసిఫాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ఎస్ వేణుగోపాల్, వారణాసి శ్రీనివాస్, టీయూడబ్ల్యూజే జిల్లా సంయుక్త కార్యదర్శి రమేష్ , టీయూడబ్ల్యూజే నాయకులు, జర్నలిస్టులు సురేష్ చారి, రాధాకృష్ణ చారి, నితీష్, రాజ్ కుమార్, ఎలక్ట్రానిక్ మీడియా విభాగం నాయకులు రాజు, దాసరి సురేష్, సాయికుమార్, సంతోష్ , వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన జాతీయ విధానానికి వ్యతిరేకింగా ఉద్యమిద్దాం

**- పిడిఎస్ యు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్**




**వేద న్యూస్, ఆసిఫాబాద్ ప్రతినిధి:**

నూతన జాతీయ విద్యా విధానం 2020 కి వ్యతిరేకంగా ఉద్యమిద్దామని పి డి ఎస్ యు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. పిడిఎస్ యూ 20వ జిల్లా మహాసభలను జిల్లా కేంద్రంలోని మాలి సంఘ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గత 50 సంవత్సరాలుగా దేశంలోని పేద విద్యార్థుల భవిష్యత్తు ప్రధాన ధ్యేయంగా వారి అభివృద్ధి కోసం, శాస్త్రీయ విద్యాసాధనకై పిడిఎస్ యూ అలుపెరుగని పోరాటం చేసిందని గుర్తు చేశారు. పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని పలు తీర్మానాలు చేసి ఆమోదించారు. అంతకుముందు పిడిఎస్ యూ జిల్లా అధ్యక్షుడు కళ్యాణ్ జెండా ఆవిష్కరించగా జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి అమర వీరుల సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎండి చాంద్ పాషా పిడిఎస్ యూ మాజీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం, నాయకులు తరుణ్, సమీర్, దీపక్, మల్లేష్, వసంత్, శివప్రసాద్, నందిని, పోశం తదితరులు ఉన్నారు.

వేద న్యూస్

శనివారం, నవంబర్ 29, 2025

# బహుజనుల ఆరాధ్య దైవం మహాత్మా జ్యోతిరావు పూలే

## – బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ రూపునార్ రమేష్

**వేద న్యూస్, ఆసిఫాబాద్ ప్రతినిధి:**

బహుజనుల ఆరాధ్య దైవం మహాత్మా జ్యోతిరావు పూలే అని బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ రూపునార్ రమేష్ అన్నారు. శుక్రవారం జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ లో గల పూలే దంపతుల కు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు రేగుంట కేశవ్ , జిల్లా బీసీ సంక్షేమ సంఘం రైతు అధ్యక్షుడు వైరాగడి మారుతి పటేల్, బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గురునులే మేంగాజీ, మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు, న్యాయవాది నీకుడే రవీందర్, అఖిలభారత మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నాగోశే శంకర్, వాంకిడి మాలి సంక్షేమ సంఘం అధ్యక్షుడు బాబురావు, ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షుడు గుండా శ్యామ్ , కాంగ్రెస్ పార్టీ మైనారిటీ ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు షేక్ అసాద్ , కోలాం సంఘ జిల్లా అధ్యక్షుడు జలపతి , లుంబిని దీక్ష భూమి మాజీ అధ్యక్షుడు దుర్గం తిరుపతి ,షిండే రాందేవ్, పులగం వెంకన్న వివిధ మండలాల మాలి సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# లయన్స్ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం



**వేద న్యూస్, రుద్రూర్ :**

రుద్రూర్ మండల కేంద్రంలోని శ్రీ రేణుకా మాత ఎల్లమ్మ ఆలయం వద్ద శుక్రవారం రోజున లయన్స్ క్లబ్ ఆఫ్ రుద్రూర్ వారి ఆధ్వర్యంలో లయన్స్ కంటి ఆసుపత్రి బోధన్ వారి సహకారంతో ఉచిత కంటి శిబిరాన్ని నిర్వహించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో 78 మంది రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. అదేవిధంగా ఇందులో 16 మంది రోగులకు కంటిలో మోతె బిందు ఉన్నట్టు గుర్తించి వారికి లయన్స్ కంటి ఆసుపత్రి బోధన్ వారికి రెఫర్ చేశారు. లయన్స్ కంటి ఆసుపత్రి కంటి నిపుణులు అజయ్ గౌడ్, వారి సిబ్బందితో రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ రుద్రూర్ అధ్యక్షులు లయన్ కె.వి.మోహన్, జిల్లా చైర్మన్ లయన్ శ్యాంసుందర్ పహాడే, కార్యదర్శి గుండూరు ప్రశాంత్ గౌడ్, క్లబ్ కార్యవర్గ సభ్యులు లయన్ కటికె రామ్ రాజ్, గ్రామవాసులు సతీష్ గౌడ్, ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# పున్న కైలాస్ కి మంత్రి క్షమాపణలు చెప్పాలి

**వేద న్యూస్,శాయంపేట:**

రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తక్షణమే భే షరతుగా నల్గొండ డిసిసి ప్రెసిడెంట్ పున్న కైలాస్ కు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ శాయంపేట మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు.అనంతరం శాయంపేట మండల తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షుడు వంగర సాంబయ్య మాట్లాడుతూ నాటి నుండి నేటి వరకు అగ్రకుల అహంకారంతో బీసీ పద్మశాలీలను అణగ తొక్కుతున్నారని తాతలు ముత్తాతలు చేసిన సేవను గుర్తించి డిసిసి అధ్యక్ష పదవి కైలాస్ ను వరించిందని అన్నారు.పదవి కేటాయింపులో భాగంగా జిల్లా మంత్రి అయిన కోమటిరెడ్డి వెంకటరెడ్డిని మర్యాదపూర్వకంగా గౌరవంగా కలవడానికి కైలాస్ తన అనుచరులతో మంత్రి చాంబర్ వెల్లగా బయటనే ఉంచి ఎవడు రా నీకు డిసిసి అధ్యక్ష పదవి ఇచ్చినారని ఆ పదవి నుండి నిన్ను వెంటనే తొలగించాలని ముఖ్యమంత్రి కి లేఖ రాస్తానని నిన్ను కలిసేది లేదు వెళ్ళిపో అంటూ ఇష్టం వచ్చినట్టు దుర్భాషలాడిన అగ్రకుల అహంకారి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చర్యను రాష్ట్రవ్యాప్తంగా పద్మశాలి లు అందరూ ముక్తకంఠంతో ఖండిస్తూ పన్న కైలాస్ కు తక్షణమే క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్



చేశారు. భవిష్యత్తులో అగ్రకుల అహంకారి రెడ్లు తెలంగాణలో తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా అగ్రకుల అహంకార రెడ్లు ఎక్కడ నుండి ప్రజాప్రతినిధులుగా పోటీ చేసిన ఓడించాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు వనం దేవ రాజు,చిందం రవి, దిడ్డి ప్రభాకర్, బూర లక్ష్మీనారాయణ, రంగు ఐలుమల్లు ,భాసని విద్యాసాగర్, వాలుపదాసు చంద్రమౌళి, తుమ్మ ప్రభాకర్, గొట్టి ముక్కుల రమేష్,దిండిగాల రమేష్,తదితరులు పాల్గొన్నారు.

# చెక్ డ్యాములు,రోడ్లు, డోలి సమస్యలను పరిష్కరించాలి

**వేద న్యూస్, పార్వతీపురం మన్యం జిల్లా :**

ఏజెన్సీ లో ఉన్న చెక్ డాములు మినీ రిజర్వాయర్లు రోడ్లు పూర్తి చేయాలని సిపిఐ (ఎమ్ ఎల్) రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి తోట జీవన్న డిమాండ్ చేశారు. సమస్య లను పరిష్కరించాలని పార్వతిపురం ఐటిడిఏ పిఒకి పార్టీ ఆధ్వర్యంలో మెమోరాన్ని ఇవ్వడం జరిగినది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్వతీపురం మన్యం ఏజెన్సీలో ఇప్పటికే పెండింగ్లో ఉన్న చెక్ డ్యామ్ లను,మినీ రిజర్వాయర్లను, లింక్ రోడ్లను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రోడ్లు లేకపోవడంతో ఇప్పటికే రోగులను డోలి లపై గిరిజనులు తీసుకువెళ్లడం జరుగుతుంది. సకాలంలో వైద్యం అందకపోవడంతో అనేక గ్రామాల్లో గిరిజనులు కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కోల్పోవడం జరుగుతుంది అని అన్నారు. మన్యంలో అనేకమైన జీవనదులు ఉన్నప్పటికీ వాటిని ప్రభుత్వాలు సకాలంలో ఉపయోగించకపోవడంతో మన్యంలో పంటలు పండించలేక గిరిజనుల అర్ధాకులతో బ్రతుకులు ఈడుస్తున్నారని అన్నారు. ఇప్పటికే ఎన్ని ప్రభుత్వాలు మారినను గిరిజన బ్రతుకులు మారడం లేదు అన్నారు, కూటమి అనేక వాగ్దానాలు ఇచ్చి అధికారులకు వచ్చినది రెండు సంవత్సరాలు అయినప్పటికీ గిరిజన సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడ ఉన్నట్లు ఉన్నాయని అన్నారు. కురుపాం నియోజకవర్గంలో ఉన్న గిరిజన గ్రామాలైన తోలంగూడ , డి .భారామని భారామని కూడా సాల్దంగూడ, మాల గాడి గు, పోక్కిరి, వనకాబడి, వాడ జంగి గిరిజన గ్రామాలకు బీటీ



రోడ్లు వేయాలని డిమాండ్ చేశారు, బీటీ రోడ్లు వేస్తామని డోలిమోతల్లేని గిరిజన గ్రామాలను ఏర్పాటు చేస్తామని ప్రకటించి 20 నెలలు దాటుతున్న ఇంతవరకు గిరిజన గ్రామాలకు రోడ్లు వేయలేదని అన్నారు. పవన్ కళ్యాణ్ మన్యం జిల్లా ఏజెన్సీ ప్రాంతానికి వచ్చి గిరిజన గ్రామాలకు రోడ్లు వేస్తామని హామీ ఇచ్చారు. కానీ హామీ అమలు కాలేదని అన్నారు. వెంటనే పై గిరిజన గ్రామాలకు బీటీ రోడ్లు వేయాలని 28 వ తేదీన ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వారికి మెమోరాండం ఇస్తామని అప్పటికీ సమస్యలు పూర్తి కాకపోతే పెద్ద ఎత్తున గిరిజనులను కదిలించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ భారత మహాసభ జిల్లా కన్వీనర్ బిడ్డక రామ్మూర్తి, పాడి చిరంజీవి, ఏ. సీతమ్మ, బొత్స మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త బ్రిడ్జిని పరిశీలించిన ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర

**వేద న్యూస్, పార్వతీపురం మన్యం జిల్లా :**

సీతానగరం మండల కేంద్రంలో నూతనంగా నిర్మాణం జరుగుతున్న బ్రిడ్జి పనులను పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు ఎంతవరకు జరిగాయి, ఎప్పుడు పూర్తి అవుతాయి అని సంబంధిత ఆర్ అండ్ బి ఇంజనీర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయచంద్ర మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణ పనులు అతివేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే బ్రిడ్జి ప్రజలకు అందుబాటులకు తీసుకురావడం జరుగుతుందని ఎమ్మెల్యే అన్నారు. పాత బ్రిడ్జి పాడవడంతో రాకపోకలకు ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేయడానికి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని అన్నారు. ఎమ్మెల్యేతో పాటు ఆర్ అండ్ బి అధికారులు ఉన్నారు.



# జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి అధ్యక్షతన స్కూల్ ఆఫ్ మేనేజ్మెంట్ అధ్యాపకులు ఫిబ్రవరి 19, 20వ తేదీలలో జరిగే రెండు రోజుల జాతీయ సదస్సుకు తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ యొక్క ఆర్థిక సహకారంతో నిర్వహించే జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిది గా కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి ఆవిష్కరించారు. ప్రపంచ వ్యాపార నిర్వహణ పద్ధతుల్లో సమకాలీన సమస్యల పై రెండు రోజులు జాతీయ సమావేశం ఉంటుదని సమావేశ డైరెక్టర్ ఫ్లైయింగ్ ఆఫీసర్ డాక్టర్ బి. ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిధులుగా డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ సీనియర్ అధ్యాపకులు ప్రొఫెసర్ కె.రాజేందర్, ప్రొఫెసర్ పి.అమరవేణి, ప్రొఫెసర్ పి.వరలక్ష్మి, ప్రొఫెసర్ ఎస్. నర సింహచారి, ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రహ మాన్, ఆర్ట్స్ కళాశాల కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ అధ్యాపకులు డాక్టర్ స్వామి శాడా, డాక్టర్ ఏ సురేష్, డాక్టర్ అజ్మీరా రమేష్, డాక్టర్ కె సోమశేఖర్, డాక్టర్ గిరిప్రసాద్, డాక్టర్ బక్కి శ్రీనివాస్, డాక్టర్ ఏ సునీత, డాక్టర్ మయూరి శ్రీవాస్తవ పాల్గొన్నారు.




# జిల్లెల్ల చెక్ పోస్ట్ ఆకస్మిక తనిఖీ

**వేద న్యూస్, తంగళ్ళపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి గ్రామపంచాయతి ఎన్నికల సందర్భంగా తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని జిల్లెళ్ల వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ ఆకస్మిక తనిఖీ చేసి వాహన తనిఖీలు చేసి నమోదు చేసిన రిజిస్టర్ ను పరిశీలించడంతో పాటు,ప్రత్యక్షంగా పోలీస్ సిబ్బంది వాహనాలు తనిఖీలు చేస్తున్న తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.తనిఖీల సమయంలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహారించందంతో పాటు,వాహనాలను క్షుణ్ణముగా తనిఖీ చేసి అక్రమ నగదు, మద్యం రవాణాను అరికట్టాలని సూచించారు.ఓటర్లను ప్రలోభ పెట్టడానికి డబ్బులు, మద్యం, ఇతర విలువైన వస్తువులు తీసుకొని వెళ్తున్నట్లు సమాచారం ఉంటే పోలీస్ స్టేషన్ వారికి సమాచారం అందించాలని సూచించారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరైనా పాల్పడితే వారిపై ఎన్నికల నియమావళి ప్రకారం ప్రకారం చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎస్పీ వెంట సి.ఐ మొగిలి,చెక్ పోస్ట్ సిబ్బంది ఉన్నారు



# విద్యతోనే సాధికారత సాధ్యం

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

మహాత్మా జ్యోతి రావు పూలే 135 వ వర్ధంతి సందర్భంగా కేయూ బి.సి . సెల్ సంచాలకులు డాక్టర్ బి. సతీష్ ఆధ్వర్యంలో దూర విద్య ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కేయూ విసి ఆచార్య కే. ప్రతాపరెడ్డి హాజరై పులే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విసి మాట్లాడుతూ విద్యతోనే సమాజంలో సాధికారిక సాధ్యమవుతుందని, మహిళా అభివృద్ధి, అణగారిన ప్రజల అభివృద్ధికి జ్యోతిరావు పూలే కృషి చేశారన్నారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, దూర విద్య కేంద్ర సంచాలకులు ఆచార్య బి. సురేష్ లాల్, కేయూ పాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్రా రాజు, పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# నూతన దంపతులకు మెపా రాష్ట్ర అధ్యక్షుల ఆశీర్వాదం

**వేద న్యూస్, వరంగల్ :**

వరంగల్ జిల్లా నెక్కొండ మండలం గుంటుపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన వివాహ వేడుకలో మెపా (ముది రాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. గుండ్రపల్లి కి చెందిన ల్యాక భాగ్యలక్ష్మి – రమేష్ దంపతుల కుమార్తె ల్యాక శ్రావణి తో దాసరి గోవర్ధన్ – శుభద్ర దంపతుల కుమారు డు రజనీకాంత్ తో శుక్రవారం గుండ్రపల్లి లో జరిగింది.ఈ శుభకార్యానికి మెపా వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు చెట్టబోయిన శ్రీనివాస్ ముది రాజ్ ,భాషబోయిన రాజు, జయశంకర్ ల ఆహ్వానం మేరకు పులి దేవేందర్ ముదిరాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన దంప తులకు ముదిరాజ్ కులదైవం పెద్దమ్మ తల్లి చిత్ర పటాన్ని బహుకరించారు.ఈ సందర్భంగా దేవేం దర్ ముదిరాజ్ మాట్లాడుతూ..ముదిరాజుల ఇళ్లల్లో ఎక్కడ ఇలాంటి శుభకార్యం జరిగిన పెద్దమ్మ తల్లి త్రిపటాలను బహుమానంగా అంది ంచే సంస్కృతి అలవాటు



చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మెపా వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ ముదిరాజ్, జిల్లా ఉపాధ్యక్షులు చెట్టబోయిన శ్రీనివాస్, చెన్నారావు పేట మండల నాయకులు రొడ్డ కుమారస్వామి, భద్రయ్య, నిమ్మబోయిన నాగరాజు,సార రాజు, వాకిటి ప్రదీప్,దండు శ్రీనివాస్, దండు రాజేందర్, నరసింహస్వామి, భాషబోయిన జయ శంకర్, రాజు,దాసరి రజినీకాంత్, గోవర్ధన్, పొన్నం సాంబయ్య, ఉప్పరి కనకయ్య, నరసింహ స్వామి, వెంకన్న, చిరంజీవి ముదిరాజ్, పున్నం లక్ష్మి,, చెట్టబోయిన అనూష,యశోద, స్వాతి, సౌజన్య ముదిరాజ్ లతో పాటు కుటుంబ సభ్యులు బంధువులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073

# కృత్రిమ మేధస్సుపై జాతీయ సదస్సు కరపత్రం ఆవిష్కరణ

**వేద న్యూస్, కరీంనగర్ :**



శాతవాహన విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 4 ,5 ఫిబ్రవరి 2025లో భారత ఆర్థిక వ్యవస్థపై కృత్రిమ మేధస్సు ప్రభావం అనే అంశంపై రెండు రోజుల జాతీయ స్థాయి సదస్సు కరపత్రమును విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ యు.ఉమేష్ కుమార్, రిజిస్ట్రార్ ఆచార్య రవికుమార్ జాస్తి, ఓ.ఎస్.డి. టు విసి డాక్టర్ హరికాంత్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్. సురేష్ కుమార్ సంయుక్తంగా విడుదల చేశారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో వివిధ అంశాలపై కృత్తిమ మేధస్సు యొక్క ప్రభావం, భారత ఆర్థిక వ్యవస్థ పై కృత్రిమ మేధస్సు ప్రభావం దాని యొక్క పర్యవసానాలు మొదలకు అంశాలపై వ్యాసాలను జాతీయస్థాయిలోని మేధావులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు ,పరిశోధకులు మరియు విద్యార్థులు డిసెంబర్ 30 లోపు పంపించాలని వచ్చిన వ్యాసాలు అన్నింటిని క్రోడీకరించి ఉత్తమమైన వ్యాసాలను జర్నల్స్ లో ప్రచురించడం జరుగుతుందని సదస్సు కన్వీనర్ అర్థశాస్త్ర విభాగ అధిపతి మరియు అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ కోడూరీ శ్రీవాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ సోషల్ సైన్సెస్ ప్రొ. ఏం. వరప్రసాద్, విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. సూరేపల్లి సుజాత, డాక్టర్ కే. పద్మావతి. డాక్టర్ ఉమేరా, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# వరద బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం



**- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**వేద న్యూస్, హనుమకొండ :**

నవంబర్ నెలలో వచ్చిన అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న సహాయక చర్యలలో భాగంగా శుక్రవారం హనుమకొండ మరియు కాజీపేట మండలలో సంబదించిన వరద బాధిత కుటుంబాలకు ప్రభుత్వం కల్పించిన రేషన్ ని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి , నగర మేయర్ గుండు సుధారాణి,చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డితో కలిసి బాధిత కుటుంబాలకు అందజేశారు. రెండు మండలాలకు గాను మొత్తం 57 వ డివిజన్ వాజ్ పేయ్ కాలనీలో మరియు 49 డివిజన్ లోటస్ కాలనీల్లో పంపిణీ చేశారు. పంపిణీ కార్యక్రమ అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ అకాల వర్షాలతో నగరంలో చాలా చోట్ల ఆర్థిక నష్టం వాటిల్లిందని వరదల కారణంగా నష్టపోయిన కుటుంబాలను మరుసటి రోజే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సంబధిత మంత్రులు, అధికారు లు పర్యటన చేసి జరిగిన నష్టాన్ని అంచనావేసి వరద సహాయం కింద రూ. 15000 ప్రకటించారని గుర్తు చేశారు.బాదిత కుటుంబాలకు చెందిన బ్యాంకు ఖాతాల నెంబర్లు తప్పుగా ఇవ్వడం కారణంగా ఆలస్యం అయిందని ఒక్కొక్కటిగా బ్యాంకు ఖాతాలో నగదు బదిలీ సోమవారం నాటికి పూర్తి అవుతుందని తెలిపారు.2440 మందికి నష్ట పరిహారంగా రూ.3.76 కోట్లు రూపాయలను 504 క్వింటాళ్ల రేషన్ బియ్యం అందించామని తెలిపారు.గతంలో వరదలు వస్తే ఫోటోలకు పోస్ ఇచ్చిన పరిస్థితులే తప్ప ఒక్క రూపాయి అందించిన దాఖలాలు లేవని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాస్ రావు, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు,ఆర్టీఏ మెంబెర్ పల్లకొండ సతీష్, కార్పొరేటర్ మానస రాం ప్రసాద్, బంక సరళ సంపత్ యాదవ్ ఆయా డివిజన్ ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ అధికారులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చెత్తను కాల్చొద్దు

**- పర్యావరణ పరిరక్షణ పై పోస్టర్ ఆవిష్కరణ..**
**- శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయంలో**

**వేద న్యూస్, జమ్మికుంట:**



ఆర్ ఎస్ ఎస్ శతాబ్ది ఉత్సవాల పంచ పరి వర్తన లోనీ పర్యావరణ పరిరక్షణ లో భాగంగా విద్యాపీఠం ఆదేశానుసారం శుక్రవారం ఆవాస విద్యాలయం ప్రధానాచార్య పోల్సాని సుధాకర్ రావు, ఉప ప్రధానాచార్య పోతన శ్రీకాంత్ చేతుల మీదుగా పర్యావరణం ను గురించి అవగాహన కల్పించే పర్యావరణ పోస్టర్ ను ఆవిష్కరిం చారు. పర్యావరణ పరి రక్షణ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

# బహుజనుల విద్యకు బాటలు వేసిన విద్యావేత్త పూలే

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**




బహుజనులకు విద్య అందించి వారి జీవితాల్లో వెలుగు నింపిన మహనీయుడు మహాత్మ జ్యోతిబా పూలే అని పూలే ఆశయ సాధన సమితి (పాస్) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్ గుర్తు చేసుకున్నారు. శుక్రవారం నాడు కాకతీయ విశ్వవిద్యాలయం, దూరవిద్య కేంద్రంలోని పూలే ప్రాంగణంలో మహాత్మ జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పూలే దంపతుల విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మల్లేశ్వర్ మాట్లాడుతూ అణచివేతకు గురైన బడుగు, బలహీనవర్గాల ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించి, వారి హక్కుల కోసం పోరాడి తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయులని, బడుగులకు సాధికారత కల్పించడంలో ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పాస్ అధ్యక్షులు తాడూరి శాస్త్రి, పాస్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చందా మల్లయ్య, పాస్ నాయకులు డాక్టర్ కే బిక్షాలు, శ్రీరామ్ వీరయ్య, డాక్టర్ ఎన్ వీణ, కందుల తరుణ్, తుర్పాటి వేంకటేష్, మాలోత్ సురేందర్, పి.వైష్ణవి, యశస్విని, డాక్టర్ ఎస్ జ్యోత్న తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే నాయిని

**వేద న్యూస్,హనుమకొండ :**



తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నదని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే నాయిని నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి 49 వ డివిజన్ ప్రగతి నగర్లో రూ.100 లక్షలతో, 48 డివిజన్లో రూ.209 లక్షలతో అంతర్గత రోడ్ల అభివృద్ధి,సైడ్ డ్రైన్ నిర్మాణం,దర్గా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.స్థానిక ప్రజలను మమేకం చేస్తూ సాగిన ఎమ్మెల్యే నాయిని పర్యటన ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలు నిరంతర ప్రక్రియ అని గత పాలకుల హయాంలో జరగని అభివృద్ధి పనులు గడిచిన రెండేళ్లలోనే చేపడుతున్నామని తెలిపారు.ఎక్కడ కూడా రాజకీయ భేదాలకు తావు లేకుండా అన్ని డివిజన్లను సమపాళ్లలో అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం దర్గా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే దర్గా పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం అధికంగా ఉండటం పట్ల హర్షం వ్యక్తం చేశారు.రానున్న రోజుల్లో పాఠశాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా,వైద్యం పట్ల ప్రత్యేక శ్రద్ధతో కృషి చేస్తున్నారని విద్యార్థులకు వెల్లండించారు.బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగి మన ప్రాంతానికి రాష్ట్రానికి మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాలలో ఆయా డివిజన్ ల కార్పొరేటర్లు సత్రాజ్ బేగం, మనసా రామ్ ప్రసాద్,మాజీ కార్పొరేటర్ అబూబకర్,సీనియర్ నాయకులు అమర్,మట్టెడ కుమార్,లెంకలా శ్రీనివాస్ డివిజన్ అధ్యక్షులు మల్లారెడ్డి,సింగారపు రవి ప్రసాద్ ,అధికారులు ఈఈ రవి కుమార్, డీఈ శ్రీకాంత్, రవీందర్ లు అజీజ్,ప్రవలిక మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణాయుత జీవనంతోనే ఆదర్శ పౌరులు

**- అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి**




**వేద న్యూస్, వరంగల్:**

జన విజ్ఞాన నివేదిక హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు జెవివి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కాజీపేట పురుషోత్తం అధ్యక్షతన శుక్రవారం సెంటిపీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్లో నిర్వహించబడ్డాయి. ప్రారంభ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎ వెంకట్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. విద్యార్థి దశలో క్రమశిక్షణ జీవనం అలవర్చుకున్నప్పుడే ఆదర్శ పౌరునిగా ఎదుగుతారనీ చెప్పారు. మనమంతా ఇప్పుడు శాస్త్ర సాంకేతిక యుగంలో ఉన్నా మని, భారదేశం ఉత్పత్తి రంగంలో స్వావలంబన కోసం కృషి చేస్తున్నది..అందులో రేపటి పౌరులుగా మీరంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. శాస్త్రవేత్తలతో ముఖాముఖి లో భాగంగా నిట్ ఆచార్యులు ఆచార్య ఆంజనేయులు, ఆచార్య రామారావు, ఆచార్య కృష్ణానంద్, ఆచార్య లక్ష్మారెడ్డి, ఆచార్య కేశవరావు శాస్త్ర సాంకేతిక రంగాలు మెరుగైన జీవనానికి ఎలా ఉపయోగపడుతున్నాయో తెలుపుతూ విద్యార్థుల, ఉపాధ్యాయుల సందేహాలను నివృత్తి చేశారు. లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ లయన్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య, సెంట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ గోపు మథ్యాస్ రెడ్డి లు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. విద్యార్థులు అంది వచ్చే ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవాలని విద్యార్థులకు స్ఫూర్తివంతమైన సందేశాన్ని ఇచ్చారు. హన్మకొండ జిల్లాలోని 14 మండలాల నుండి మండల స్థాయిలో ప్రథములుగా నిలిచిన 171 మంది విద్యార్థులు చెకుముకి సైన్స్ టాలెంట్ పోటీలలో పాల్గొనగా, ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల విభాగంలో ప్రభుత్వ మర్కజి ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఒంటిమామిడిపల్లి, బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరకాల, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల విభాగంలో మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల శాయంపేట, తెలంగాణ మోడల్ స్కూల్ ఇందిర నగర్ ఎలుకతుర్తి, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల పరకాల, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల విభాగంలో తేజస్వి పబ్లిక్ స్కూల్ హంటర్ రోడ్, సెంట్ గాబ్రియల్ ఉన్నత పాఠశాల ఫాతిమానగర్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పెద్ద పెండ్యాల, గ్రీన్ ఉడ్ ఉన్నత పాఠశాల హసన్ పర్తి, శ్రీనివాస రామానుజన్ ఒలంపియాడ్ స్కూల్ ఉనికి చర్ల, ఏకశిలా ఉన్నత పాఠశాల పున్నేల్, పాఠశాలల విద్యార్థులు రాత పరీక్షలో ప్రతిభ కనబరిచి స్టేజి క్విజ్ కు అర్హత సాధించాయి. ఆచార్య ఆంజనేయులు, ఆచార్య లక్ష్మారెడ్డి, ఆచార్య రాములు, ధర్మ ప్రకాష్, స్టేజి క్విజ్ మాస్టర్లుగా వ్యవహరించి.. ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలకు, ప్రైవేటు యాజమాన్య పాఠశాల విద్యార్థులకు వేరువేరుగా స్టేజి క్విజ్ నిర్వహించగా , ప్రభుత్వ పాఠశాలల విభాగంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఒంటిమామిడిపల్లి, రెసిడెన్షియల్ పాఠశాలల విభాగంలో తెలంగాణ మోడల్ స్కూల్ ఎల్కతుర్తి, ప్రైవేటు పాఠశాలల విభాగంలో డిల్లీ పబ్లిక్ స్కూల్ పెద్దపెండ్యాల, .తెలుగు మీడియం పాఠశాలల విభాగంలో జడ్పీహెచ్ఎస్ కౌకొండ జిల్లా స్థాయిలో ప్రథములుగా నిలిచి రాష్ట్రస్థాయి చెకిముకి సంబరాలకు అర్హత సాధించాయి. గెలుపొందిన విద్యార్థులకు ఏసిపి కె విజయకుమార్ చేతుల మీదుగా బహుమతి ప్ర దానం జరిగింది. కార్యక్రమంలో సెంట్ పీటర్స్ పాఠశాల డైరెక్టర్ గోపు సునీతరెడ్డి, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి రామంచ బిక్షపతి, కోశాధికారి పరికిపండ్ల వేణు, ఉపాధ్యక్షులు శ్రవణ్ కుమార్, ఉమామహేశ్వరరావు, విద్యా విభాగం కన్వీనర్ బిక్షపతి, కార్యదర్శులు మొగిలి, శ్రీనివాస్,జె వి వి బాధ్యులు వెంకటస్వామి, వందన, బిక్షపతి, శ్రీనివాస్, వివిధ మండలాల నుండి విచ్చేసిన జన విజ్ఞాన వేదిక చెకుమకి మండల బాధ్యులు, గైడ్ టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఏసీబీకి పట్టుబడ్డ తహశీల్దార్, జాయింట్ సబ్ రిజిస్ట్రార్..!

**- వారసత్వ భూసంబంధిత రిజిస్ట్రేషన్ కోసం లంచం డిమాండ్**
**- లంచం కోరితే వెంటనే 1064 కు ఫిర్యాదు చేయాలని ఏసీబీ విజ్ఞప్తి**

**వేద న్యూస్, మహబూబాబాద్ :**



మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగర మండల తహశీల్దారు, జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ వీరగంటి మహేందర్ లంచం కేసులో తెలంగాణ అవినీతి నిరోధక శాఖ చేతికి చిక్కాడు. ఫిర్యాదుదారురాలి భర్తకు అతని మామ నుండి వారసత్వంగా వచ్చిన వ్యవసాయ భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను తనకు అనుకూలంగా జరిపించేందుకు రూ.15,000 లంచం డిమాండ్ చేసినట్టు ఏసీబీ వెల్లడించింది. డిమాండ్ చేసిన లంచం మొత్తాన్ని తన ప్రైవేట్ డ్రైవర్ తుప్పాని గౌతమ్ ద్వారా స్వీకరిస్తున్న సమయంలో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగడంతో ఇద్దరూ రంగేహస్తులయ్యారు. లంచం విషయంలో తేరవెనుక జరుగుతున్న వ్యవహారాన్ని ముందుగా ఫిర్యాదుదారు ఏసీబీకి తెలియజేయగా, అధికారులు ముందస్తు పథకం ప్రకారం ఈ ఆపరేషన్‌ను అమలు చేశారు.ఈ ఘటన సందర్భంగా ఏసీబీ అధికార వర్గాలు, ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా లంచం డిమాండ్ చేసినట్లయితే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1064కు కాల్ చేయాలని విజ్ఞప్తి చేశాయి. అదనంగా వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్ (Telangana ACB), ఎక్స్ (@TelanganaACB) మరియు అధికారిక వెబ్‌సైట్ (acb.telangana.gov.in) ద్వారా కూడా ఫిర్యాదులు నమోదు చేయవచ్చని తెలిపారు. “ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయి” అని ఏసీబీ స్పష్టం చేసింది. అవినీతి నిర్మూలనలో ప్రజలు కూడా ధైర్యంగా ముందుకు రావాలంటూ పిలుపునిచ్చింది.

# గుంతల ఇక్కట్లు

**- ప్రమాదం జరగక ముందే స్పందించాలి**
**- తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదచారులు**

**వేద న్యూస్, జమ్మికుంట:**



జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి డౌన్ లో అటు రిలయన్స్ పెట్రోల్ పుంపు ముందు, బస్టాండ్ కి వెళ్లే దారిలో బ్రిడ్జి డౌన్ లో రోడ్డు గుంతలమయమై ప్రమాదకరంగా మారింది. గత కొంత కాలంగా అలాగే ఉన్నాకూడా అధికారులు మాత్రం చూసి చూడనట్టుగా వ్యవహారిస్తున్నారు.ఇంటిపన్నులు, నల్ల పన్నులు, ట్రేడ్ లైసెన్స్ లు టైంకి వసూలుచేస్తున్నారు.. కానీ, అనేక చోట్ల ఇలాంటి చిన్న చిన్న గుంతలు పడి ప్రజలు వాహనదారులు ఇబ్బది పడుతుంటే.. అధికారులు పట్టించుకోరా మరమ్మ తు లు చేయడంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నారు? అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు .వెంటనే ఈ గుంతలను మరమ్మ తు లు చేసి వాహనదారులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా మున్సిపల్ కమిషనర్ చొరవ చూపాలని వాహనదారులు కోరుతున్నారు. ఏదైనా ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించాలనీ, తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు అంటున్నారు.

# వరల్డ్ కప్‌లో రో - కో తప్పనిసరిగా ఉండాలే అన్న మోర్కెల్




**వేద న్యూస్ డెస్క్:**

వచ్చే వన్డే ప్రపంచకప్ సన్నద్ధతలో ఉన్న భారత క్రికెట్ దిగ్గజాలు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలను తప్పనిసరిగా ఆడించాల్సిందేనని టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ కీలక వ్యాఖ్యలు చేశాడు. అనుభవం, నాణ్యత, మ్యాచ్ పరిస్థితులను అర్థం చేసుకునే సామర్థ్యం ఈ ఇద్దరిలో అపారం అని ఆయన చెప్పాడు. వారి ఆటతీరు ప్రత్యర్థులకు ఎప్పుడూ సవాలే అవుతుందని, అనేకసార్లు వీరికి బౌలింగ్ చేస్తూ నిద్రలేని రాత్రులు గడపాల్సి వచ్చేదని గుర్తు చేసుకున్నాడు. కొద్దికాలం క్రితం స్వదేశంలో దక్షిణాఫ్రికా టెస్టు సిరీస్‌లో నిరాశ ఎదురైన టీమిండియా, ఇప్పుడు వన్డేల్లో ప్రతిష్టను నిలబెట్టుకోవాలని ప్రయత్నిస్తోంది. నవంబర్ 30న రాంచీలో మొదటి వన్డేకు సిద్ధమవుతోంది. లండన్ నుంచి చేరుకున్న కోహ్లీ, ముంబై నుంచి రాంచీకి వెళ్లిన రోహిత్ నెట్స్‌లో సుదీర్ఘ సాధన చేస్తూ కనిపించారు. ఇద్దరూ దృఢ నిశ్చయంతో మైదానంలోకి దిగబోతున్నారన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మోర్కెల్ మాట్లాడుతూ కోహ్లీ, రోహిత్‌తో ఆడిన అనుభవం తన కెరీర్‌లో ప్రత్యేకమైందని, వారి బ్యాటింగ్ తనకు ఎన్నడూ సులభం కాలేదని చెప్పాడు. రో%-%కో ఉన్నప్పుడు ఎదురు జట్టుకు ఎంత ఒత్తిడి పెరుగుతుందో అందరికీ తెలుసు అని వ్యాఖ్యానించాడు. రాబోయే ప్రపంచ కప్‌లో వీరి అనుభవం జట్టుకు బలమవుతుందని, ఫిట్‌నెస్, ఫారమ్ నిలకడగా ఉంటే స్క్వాడ్‌లో వీరి స్థానంపై సందేహం లేదని స్పష్టం చేశాడు. ఇక వన్డే సిరీస్‌పై స్పందిస్తూ గత రెండు వారాల ఆట నిరాశ కలిగించినా, వన్డేల్లో టీమిండియా తన అసలు శక్తిని చూపుతుందన్న నమ్మకం ఉందని తెలిపాడు. సీనియర్ల ఉనికి యువ ఆటగాళ్లకు ఉత్తేజాన్ని ఇస్తుందని, సమష్టిగా కలిసి ఆడితే దక్షిణాఫ్రికాపై విజయం సాధించడం సాధ్యమని మోర్కెల్ అభిప్రాయపడ్డాడు. రో-కో అనుభవం, నైపుణ్యం, ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యం ఉన్నప్పుడు భారత క్రికెట్‌కు అదొక పెద్ద శక్తి. ఈ నేపథ్యంలో 2027 ప్రపంచకప్‌లో వీరి పాత్ర కీలకం కానుందని మోర్కెల్ మాటలు స్పష్టతనిచ్చాయి. భారత్ - దక్షిణాఫ్రికా మధ్య మూడు వన్డేల సిరీస్ నవంబర్ 30 నుంచి రాంచీలో ప్రారంభమవనుంది.

# చిచ్చు రేపిన గంభీర్ ప్రెస్ కాన్ఫరెన్స్ - బీసీసీఐ ఆగ్రహం?

**వేద న్యూస్ డెస్క్:**




భారత జట్టు ప్రధాన కోచ్‌గా గౌతమ్ గంభీర్ వ్యవహరిస్తున్న తీరు మరోసారి చర్చకు దారి తీసింది. సొంతగడ్డపై దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌ను వినాశనకరంగా కోల్పోయిన నేపథ్యంలో, బీసీసీఐ పెద్దలు గంభీర్ ధోరణిపై తీవ్ర అసంతృప్తిగా ఉన్నారని వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా కోల్‌కతా టెస్టు అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన చేసిన వ్యాఖ్యలు బీసీసీఐ దృష్టిని పూర్తిగా ఆకర్షించాయి. కోల్‌కతా టెస్టులో ఘోర పరాజయం అనంతరం గంభీర్ ప్రవర్తించిన తీరు, ఆయన సమాధానాల్లో కనిపించిన అసహనం బోర్డు పెద్దలకు రుచించలేదని సమాచారం. పిచ్‌పై గంభీర్ చేసిన విమర్శలు విస్తృత చర్చకు దారితీయగా ఇలాంటి వ్యాఖ్యలు జట్టులో అనవసర గందరగోళాన్ని సృష్టిస్తున్నాయని బీసీసీఐ భావిస్తోంది.ద్రవిడ్, శాస్త్రి హయాంలో సొంతగడ్డపై దాదాపు అజేయుల్లా ఉన్న టీమిండియా, గంభీర్ కోచింగ్‌లో జట్టు ఓటమికి తానూ బాధ్యత వహిస్తున్నట్లు చెప్పినప్పటికీ, ఆయన మాటల్లో కనిపించిన వ్యతిరేక ధోరణి బోర్డు ఆగ్రహానికి కారణమైంది.

## అండర్ -19 ఆసియా కప్ కోసం

# టీమిండియా జట్టు ఖరారు



**వేద న్యూస్ డెస్క్:**

అండర్ -19 క్రికెట్‌కు మరింత బలం చేకూర్చే ఆసియా కప్ కోసం భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది. యువ క్రికెట్‌లో సంచలనం సృష్టించిన 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీకి ఈ జట్టులో స్థానం దక్కడం ప్రధాన ఆకర్షణగా మారింది. డిసెంబర్ 12 నుంచి 21 వరకు దుబాయ్‌లో జరిగే ఈ వన్డే టోర్నమెంట్ ద్వారా వచ్చే సంవత్సరం జరగనున్న అండర్ -19 ప్రపంచకప్‌కు సన్నాహకాలు మరింత వేగం కానున్నాయి. ఈసారి జట్టుకు నాయకత్వం ఆయుష్ మాత్రేకు అప్పగించారు. అతని నాయకత్వంలో జట్టు మరింత బలపడుతుందనే నమ్మకం సెలక్షన్ కమిటీ వ్యక్తం చేసింది. వైస్ కెప్టెన్‌గా విహాన్ మల్హోత్రాను ఎంపిక చేశారు. జట్టులో 15 మంది ఆటగాళ్లు చోటు చేసుకున్నారు. భారత్ తొలి మ్యాచ్ డిసెంబర్ 14న పాక్‌తో జరగనుండడంతో ఈ సమరం పట్ల అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. జట్టులో బ్యాటింగ్, బౌలింగ్, ఆల్‌రౌండ్ విభాగాల్లో సమతుల్యతను కాపాడేలా ఎంపిక చేసినట్లు బీసీసీఐ తెలిపింది. విదేశీ నేలపై జరుగుతున్న ఈ టోర్నీలో యువభారత జట్టు ప్రతిభను మరోసారి నిరూపిస్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

**భారత జట్టు:**

ఆయుష్ మాత్రే (కెప్టెన్), విహాన్ (వైస్ కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, వేదాంత్, అభిజ్ఞాన్, హర్వాన్, యువరాజ్ గోహిల్, కనిష్క్, ఖిలాన్, పుష్పక్, దీపేశ్, హెనిల్ పటేల్, కిషన్, ఉధవ్, ఆరోన్ జార్జ్. అండర్ -19 క్రికెట్ నుంచి టీమిండియా సీనియర్ స్థాయికి ఎదిగిన అనేక మందిని ఉదాహరణగా చూసిన అభిమానులు, ఈ కొత్త తరం కూడా అంతర్జాతీయ స్థాయిలో వెలుగొందుతుందనే నమ్మకంతో ఉన్నారు.

## జీడీపీ భారీ పెరుగుదలను

# నమోదు చేసిన భారత్

**వేద న్యూస్ డెస్క్:**




భారతదేశం 2025 -26 ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో అత్యంత శక్తివంతమైన వృద్ధిని సాధించింది. తాజా అధికారిక గణాంకాలు వెల్లడించగా, సెప్టెంబర్ 30తో ముగిసిన ఈ త్రైమాసికంలో దేశ స్థూల దేశీయోత్పత్తి 8.2 శాతం పెరిగింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన 5.6 శాతం వృద్ధితో పోలిస్తే ఈ పురోగతి విశేషమైంది.వాస్తవ స్థూల దేశీయోత్పత్తి రూ.48.63 లక్షల కోట్లుగా అంచనా వేయబడింది. ఇది 2024-25 రెండవ త్రైమాసికంలో నమోదైన రూ.44.94 లక్షల కోట్లతో పోలిస్తే గణనీయమైన పెరుగుదల. నామమాత్రపు స్థూల దేశీయోత్పత్తి కూడా రూ.85.25 లక్షల కోట్లకు చేరి 8.7 శాతం వృద్ధిని చూపించింది.దేశ స్థూల విలువ ఆధాన్యం కూడా బలమైన ప్రగతిని ప్రదర్శించిం ది. వాస్తవ విలువ ఆధాన్యం రూ.44.77 లక్షల కోట్లుగా నమోదై, గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే 8.1 శాతం వృద్ధిని చూపింది. నామమాత్రపు విలువ ఆధాన్యం రూ.77.69 లక్షల కోట్లకు పెరిగి 8.7 శాతం పురోగతిని సాధించింది .వ్యవసాయం, విద్యుత్, వాయువు, నీటి సరఫరా వంటి యుటిలిటీ రంగాలు స్థిరమైన పురోగతిని ప్రదర్శించాయి. తయారీ రంగం 9.1 శాతం, నిర్మాణ రంగం 7.2 శాతం వృద్ధి సాధించాయి. ఆర్థిక సేవలు, ఆస్తి రంగం, వృత్తిపర సేవలు 10.2 శాతం పెరుగుదలతో ఆర్థిక వ్యవస్థకు బలం చేకూర్చాయి. ప్రైవేట్ వినియోగ వ్యయం 7.9 శాతం పెరిగి, ప్రజల ఖర్చు సామర్థ్యం మరింత పెరుగుతున్న సంకే తాలు ఇచ్చింది .2025-26 ఆర్థిక సం వత్సరం మొదటి అర్థభాగంలో దేశ వృద్ధి రేటు 8 శాతానికి చేరింది. ప్రపంచ ఆర్థిక పరి స్థితుల్లో అనిశ్చితి ఉన్నప్పటికీ, భారత్ అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ముందంజలో నిలుస్తోంది. ముఖ్య అంతర్జాతీయ సంస్థలు కూడా భారత వృద్ధి వేగాన్ని ప్రశంసిస్తున్నాయి. భారతదేశ స్థూల దేశీయోత్పత్తి అనేది దేశంలో ఒక నిర్దిష్ట కాలంలో ఉత్పత్తి చేసిన వస్తువులు, సేవల మొత్తం విలువ. దీనిని సంబంధిత శాఖలు, మంత్రిత్వ శాఖలు, ఇతర అధికారిక సంస్థల గణాంకాల ఆధారంగా నిర్ణయిస్తారు. భారత ఆర్థిక వ్యవస్థ వేగవంతమైన ప్రగతితో ప్రపంచ మార్కెట్ల దృష్టిని మరింతగా ఆకర్షిస్తోంది.

# రూ.55 వేలకే అధిక మైలేజ్ ఇచ్చే బైక్

**వేద న్యూస్ డెస్క్:**



ప్రస్తుతం దేశంలో పెట్రోల్ ధరలు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో, తక్కువ ధరకే ఎక్కువ మైలేజ్ ఇచ్చే మోటార్ సైకిల్ కోసం వినియోగదారులు ఎక్కువగా ఎదురు చూస్తున్నారు. అలాంటి పరిస్థితుల్లో హీరో కంపెనీ అందిస్తున్న ఎచ్‌ఎఫ్ డీలక్స్ బైక్‌కు భారీ డిమాండ్ ఏర్పడింది. సాధారణ, మధ్యతరగతి ప్రజల అవసరాలకు సరిపోయే ఈ బైక్ తక్కువ ఖర్చుతో నడిచే వాహనంగా గుర్తింపు పొందింది.ఈ బైక్ బేసిక్ నమూనా ధర రూ.55,992 మాత్రమే. అత్యున్నత నమూనా కూడా రూ.68,485 వద్దే అందుబాటులో ఉండటం వినియోగదారులను ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా ప్రతి లీటర్ పెట్రోల్‌కు సుమారు 70 కిలోమీటర్ల ప్రయాణం చేసే సామర్థ్యం ఈ బైక్‌కి ఉండటంతో, అమ్మకాలు వేగంగా పెరుగుతున్నాయి. ఈ మైలేజ్‌ను సంబంధిత సంస్థలు కూడా ధ్రువీకరించాయి. కంపెనీ అధికారిక వివరాల్లో కూడా ఇదే పేర్కొనబడింది. అదనంగా, ఈ బైక్‌కి తక్షణ వేగం అందుకునే సామర్థ్యం ఉండటం, నిలిపిన దశలో సైడ్‌స్టాండ్ తీసిన తర్వాతే ముందుకు కదిలే భద్రతా విధానం ఉండటం ప్రత్యేకత. దీని తోడు శక్తివంతమైన ముందువైపు దీపాలు, డిజిటల్ మీటర్లు, ఆధునిక నియంత్రణ వ్యవస్థ వంటి అంశాలు వినియోగదారుల ఆకర్షణకు దోహదం చేస్తున్నాయి.

# లోకేష్ లైనప్ గందరగోళం - 'ఖైదీ 2' మళ్లీ దూరమా?

**వేద న్యూస్ డెస్క్:**



కోలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకెళ్తున్న దర్శకుడు లోకేష్ కనగరాజ్ ఇప్పుడు సినిమా ప్రియుల్లో తీవ్రమైన చర్చకు కేంద్రబిందువయ్యాడు. 'కూలీ' చిత్రం ఘన విజయం సాధించిన తర్వాత ఆయన తదుపరి ప్రాజెక్టు ఏమిటన్న ప్రశ్న రోజురోజుకూ మరింత ముదిరిపోతోంది. ప్రత్యేకంగా 'ఖైదీ 2' కోసం సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న అభిమానుల్లో అసహనం పెరుగుతోంది. 'కూలీ' తర్వాత రజినీకాంత్ - కమల్‌హాసన్‌తో భారీ మల్టీస్టారర్ తెరకెక్కిస్తారన్న ప్రచారం మొదట పెద్ద ఊపందుకుంది. ఆ ఊహాగానాలు బలపడుతుండగానే.. ఇప్పుడు ఆ చిత్రానికి లోకేష్ దర్శకత్వం వహించడం లేదన్న విషయం స్పష్టమవడంతో చర్చ మరో వైపుకు మళ్లింది. వెంటనే 'అయితే ఖైదీ 2కే మొదలు పెడతారు' అన్న ఆశా కిరణం అభిమానుల్లో చెలరేగింది. కానీ తాజాగా నెట్టింట చక్కర్లు కొడుతున్న సమాచారం మాత్రం ఆ ఆశను దెబ్బతీస్తోంది. లోకేష్ ఇప్పుడే 'ఖైదీ 2' పై దృష్టి పెట్టే పరిస్థితిలో లేడనీ, పూర్తిగా కొత్త కథ, కొత్త నటీనటులతో ఉన్న మరొక ప్రాజెక్టుకు మొగ్గుచూపుతున్నారన్న టాక్ బలంగా వినిపిస్తోంది. ఈ తాజా పరిణామం 'ఎన్ని రోజులు ఎదురుచూడాలి?' అనే ప్రశ్నను అభిమానుల నోటికి తీసుకొచ్చింది. ఇప్పటికే లోకేష్ సినిమాటిక్ యూనివర్స్ ు కైతి, విక్రమ్, లియో ు సినిమాల ద్వారా విస్తరించి, కోలీవుడ్‌లో ఒక ప్రత్యేక ప్రపంచాన్ని సృష్టించిన విషయం తెలిసిందే. ఈ యూనివర్స్‌ను పూర్తి స్థాయిలో అర్థం చేసుకునేలా చేసే కీలక భాగమే 'ఖైదీ 2'. మొట్టమొదట ఈ చిత్రానికే ప్రాధాన్యం ఇస్తారని సినీ వర్గాలు భావించాయి. కానీ వరుస కమిట్‌మెంట్లు, స్క్రిప్ట్ మార్పులు, నటీనటుల ఎంపికలో ఎదురైన సందిగ్ధత కారణంగా 'ఖైదీ 2' ముందుకు సాగకపోవడం అభిమానుల్లో అసహ్యాన్ని రగిలిస్తోంది. సోషల్ మీడియా అంతా ఒకే స్వరం వినిపిస్తోంది "మేము ఇన్ని సంవత్సరాలు కైతి యూనివర్స్ కోసం వేచిచూశాం. ఇప్పుడు మళ్లీ వేరే సినిమా అంటే ఎలా? ముందుగా ఖైదీ 2 పూర్తి చేయాలి కదా!" అంటూ ఫ్యాన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్రేడ్‌వర్గాల సమాచారం ప్రకారం 'ఖైదీ 2' కథ సిద్ధంగా ఉన్నప్పటికీ, చిత్రానికి అవసరమైన ప్రీ -ప్రొడక్షన్ పనులు ఇప్పటివరకు ప్రారంభం కాలేదట. మరో స్టార్‌తో చేసే కొత్త సినిమాకే లోకేష్ ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారన్న టాక్ బలపడుతోంది. ఇది నిజమైతే అభిమానులకు ఇది పెద్ద నిరాశగా మిగిలిపోవాల్సిందే. మొత్తం మీద లోకేష్ కనగరాజ్ లైనప్ చుట్టూ సాగుతున్న గందరగోళం, 'ఖైదీ 2' వాయిదా వార్తలు తమిళ సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. అభిమానులు ఆశతో ఎదురుచూస్తూ ఉండగా లోకేష్ ఏ దారిని ఎంచుకుంటారన్నది కోలీవుడ్ దృష్టి మొత్తాన్ని ఆకర్షిస్తోంది.

## దేశమంతా దుమ్మురేపుతున్న

# 'ది రాజా సాబ్' పాట



**వేద న్యూస్ డెస్క్:**

పాన్ ఇండియా స్థాయిలో అభిమానులను కలిగిన ప్రభాస్ నటిస్తున్న రొమాంటిక్ భయానక హాస్య చిత్రం 'ది రాజా సాబ్'పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. సంక్రాంతి 2026 కానుకగా జనవరి 9న విడుదల కానున్న ఈ చిత్రం నుంచి విడుదలైన తొలి పాట 'రెబల్ సాబ్' దేశమంతటా సంచలనం సృష్టిస్తోంది. ముఖ్యంగా హిందీ రూపంలో విడుదలైన ఈ గీతం సామాజిక మాధ్యమాల్లో ట్రెండ్‌గా నిలిచి యువతను ఆకట్టుకుంటోంది. సినిమా సంగీత ప్రచారం మొదలైన వెంటనే విడుదల చేసిన ఈ పాటకు రికార్డు స్థాయిలో స్పందన లభిస్తోంది. ప్రభాస్ తెరపై చూపిన శక్తివంతమైన హావభావాలు, సంగీత దర్శకుడు తమన్ అందించిన మాస్ స్వరాలు కలిసి ఈ పాటను సరికొత్త స్థాయికి తీసుకెళ్లాయి. అన్ని ప్రాంతాల్లో అభిమానులు ఈ పాటపై నృత్య కవర్లు, చిన్న వీడియోలు చేసి పంచుకుంటుండటంతో మరింతగా వైరల్ అవుతోంది. ముఖ్యంగా హిందీ ప్రేక్షకుల్లో ఈ పాటకు వచ్చిన ఆదరణ సినిమా పరిధిని మరింత విస్తృతం చేసింది.

# రామ్‌చరణ్ చెమటోడ్చిన 'చికిరి'..



**వేద న్యూస్ డెస్క్:**

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' నుంచి విడుదలైన 'చికిరి' పాట యూట్యూబ్‌లో సంచలనం సృష్టించింది. అన్ని భాషల్లో కలిపి ఇప్పటికే 100 మిలియన్ల వ్యూస్‌ను దాటిన ఈ పాటపై ప్రేక్షకుల్లో ఉత్సాహం తారాస్థాయికి చేరింది. ఈ విజయాన్ని మరింతగా సెలబ్రేట్ చేసుకునేందుకు మేకర్స్ తాజాగా 'చికిరి సాంగ్ మేకింగ్ వీడియో'ను విడుదల చేయగా, అది నెట్టింట వైరల్‌గా మారింది. 'ఉప్పెన' ఫేమ్ బుచ్చి బాబు సనా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ విలేజ్ స్పోర్ట్స్ డ్రామాలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ నటిస్తోంది. ఈ చిత్రంలో కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు త్రిపాఠి, సత్య తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం ఇప్పటికే టీజర్, గ్లింప్స్, పాటలతో భారీ బజ్ క్రియేట్ చేసింది.తాజాగా విడుదలైన మేకింగ్ వీడియోలో రామ్ చరణ్, జాన్వీ కపూర్, బుచ్చిబాబు సనా, సినిమా యూనిట్ మొత్తం సుమారు 45 నిమిషాల పాటు ట్రెక్కింగ్ చేస్తూ మహారాష్ట్రలోని పుణే-సవల్య ఘాట్ ప్రాంతంలోని కొండపై ఉన్న లొకేషన్‌కి చేరుకున్న దృశ్యాలు చూపించారు.ఎత్తైన కొండల మధ్య ఉన్న పచ్చదనం ఈ లొకేషన్‌ను అద్భుతంగా మలచింది. సాగిన సన్నివేశం వీడియోలో హైలైట్‌గా నిలిచింది.